క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో మాడుగుల



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ద్విసహస్ర అవధాని మాడుగుల నాగఫణిశర్మ సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నాగఫణిశర్మకు ఆలయ ఈవో రామారావు సాదరంగా స్వాగతం పలికారు. దుర్గామల్లేశ్వర స్వామివార్లను దర్శించుకున్న నాగఫణిశర్మకు ఈవో రామారావు అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం చైర్మన్ కర్నాటి రాంబాబును నాగఫణిశర్మ, ఈవో రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు.

వినతిపత్రం అందజేత



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పాఠశాలలు, కళాశాలలు ఉన్న ప్రభాస్ కాలేజీ రోడ్డు మీదుగా రోజూ పదుల సంఖ్యలో హెవీ లోడుతో లారీలు పండ్ల మార్కెట్‌కు వస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వీటిని అడ్డుకోవాలని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, 34వ డివిజన్ కార్పొరేటర్ బండి పుణ్యశీల కోరారు. ఈ మేరకు సోమవారం నగర కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ సితార విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కబేళా సెంటర్, రోటరీనగర్, బ్రహ్మయ్య కాలనీ, మిల్క్ కాలనీ, మిధిలానగర్, వంగవీటి మోహనరంగా (సితార) జంక్షన్ తదితర ప్రదేశాలలో కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అయాన్ హాస్పిటల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 21వ తేదీన హెడ్‌పోస్టాఫీస్ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వావిలాల రజనీకాంతశర్మ తెలిపారు. 21వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి వైద్య శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. పోస్టల్ శాఖ సిబ్బంది పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విజయ డెయిరీ పాడి రైతులకు ఉచిత వైద్య సేవలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) ఆధ్వర్యంలో పాడిరైతులకు సోమవారం ఉచిత వైద్య సేవలు అందించారు. మొగల్రాజపురంలోని అమెరికన్ గ్యాస్ట్రో కేర్ ఆస్పత్రిలో సోమవారం ఉదయం వైద్య సేవలు నిర్వహించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన సుమారు 70 మంది పాడి రైతులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పాడిరైతులతో చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడారు. లివర్ ఆరోగ్యం తెలుసుకునేందుకు అత్యాధునికమైన ఫైబ్రోస్కాన్ పరీక్షలు చేయించారన్నారు. డాక్టర్ అట్లూరి శ్రీదేవి, ఆసుపత్రి సిబ్బంది తమ వైద్య సేవలను అందించారు. పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ ఆంజనేయులు పేర్కొన్నారు. పాడి రైతులతో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీ రావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రీసెర్చి సెంటర్‌గా ధనేకుల కాలేజీ గుర్తింపు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీని రీసెర్చి సెంటర్‌గా (పరిశోధనా కేంద్రంగా) గుర్తిస్తూ జేఎన్టీయుకే ఉత్తర్వులు జారీ చేసిందని కాలేజీ డీన్ డాక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్(సీఎస్‌సీ) విభాగాన్ని రీసెర్చి సెంటర్‌గా గుర్తిస్తూ ఆదేశాలు ఇచ్చాయన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. విద్యాధరపురంలోని షాదీఖానాలో సోమవారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న 39 నుంచి 45 డివిజన్లకు చెందిన వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్రతో కలిసి వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థ యావత్ భారతదేశానికే ఆదర్శమని చెప్పారు. కరోనా వంటి కష్టకాలంలోనూ ప్రజలకు సేవలు అందించి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ చేర్చి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రజా సంక్షేమంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ప్రభుత్వం గ్రామ, వార్డు వలంటీర్ల సేవలను గుర్తించి వారిని సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరిస్తోందని వివరించారు. 337 మందికి సేవామిత్ర, ముగ్గురికి సేవా రత్న, ఇద్దరికి సేవా వజ్ర మొత్తం 342 మందికి పురస్కారాలు అందజేశారు. వలంటీర్లను ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, బాపతి కోటిరెడ్డి, యరడ్ల ఆంజనేయ రెడ్డి, మొహమద్ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్య రెడ్డి, మైలవరపు రత్న కుమారి, మైలవరపు మాధురి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు పురస్కారాలు అందజేసి సత్కరిస్తున్న షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

గాయత్రి సొసైటీ సేవలు అభినందనీయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గాయత్రీ సొసైటీ ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని శ్రీగాయత్రి కల్యాణ మండపంలో సోమవారం బ్రాహ్మణ బాలురకు సామూహిక ఉపనయనాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజులు సమక్షంలో వేద పండితులు, ధార్మిక విద్యాధికుల మంత్రోచ్ఛరణల మధ్య 22 మంది వటువులకు యజ్ఞోపవీత ధారణ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా విచ్చేసి వటువులకు ఆశీస్సులు అందజేశారు. భిక్షాటన, యజ్ఞోపవీతం ధరించిన అనంతరం ఆచరించవలసిన నియమాలను వటువులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజికవర్గ అభ్యున్నతికి దశాబ్దానికి పైగా గాయత్రీ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ప్రతి ఒక్క వటువు త్రికాల సంధ్యావందనం, గాయత్రీ మంత్రోపాసన తప్పనిసరిగా ఆచరించాలని సూచించారు. అప్పుడే వారి జీవన స్థితిగతులు ఉన్నత స్థాయికి చేరుకుంటాయన్నారు. ఈ సందర్భంగా త్రికాల సంధ్యావందన విశిష్టతను ఎమ్మెల్యే వివరించారు. సంధ్యావందనం సమయంలో సూర్య శక్తిని పొందేందుకు మనిషికి ఉన్న శక్తి చాలదు కనుక గాయత్రీ మంత్రాన్ని ఉచ్ఛరించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క బ్రాహ్మణుడు తన దైనందిన జీవితంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ త్రికాల సంధ్యావందనాన్ని మరువకూడదని పేర్కొన్నారు. అలాగే 16 ఏళ్ల వయసులోపే ఉపనయనాలను పూర్తి చేసుకోవలసిందిగా బ్రాహ్మణ బాలురకు ఆయన సూచించారు. అనంతరం బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజులు మాట్లాడుతూ గురుముఖంగా అగ్నికార్య సాక్షిగా చెప్పబడే మంత్రమే గాయత్రీ మంత్రమని తెలిపారు. పిన్న వయసులో ఉపనయనం జరిగిన వారికి గాయత్రీ మాత అనుగ్రహం పుష్కలంగా ఉంటుందన్నారు. నిత్యం గాయత్రీ మంత్ర జపం అనేక సత్ఫలితాలనిస్తుందని.. త్రికాల సంధ్యావందనం ద్వారా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. అలాగే ఉపనయనం జరిగిన వారు మాత్రమే పితృ కార్యక్రమాలకు అర్హులని చెప్పుకొచ్చారు.

ప్రతి ఒక్క వటువు క్రమం తప్పకుండా సంధ్యావందనం ఆచరించే విధంగా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, బ్రాహ్మణ కార్పొరేషన్ సీఈఓ నాగసాయి, గాయత్రీ సొసైటీ సెక్రటరీ చల్లా హరికుమార్, ట్రెజరర్ జేకే సుబ్బారావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, సభ్యులు లక్ష్మీనారాయణ, ఎస్ రవికుమార్, మారుతీప్రసన్న, జీవీఎస్ శర్మ, వటువులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సామూహిక ఉపనయనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షిత డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గొల్లపూడి పరిధిలోని అట్కిన్‌సన్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 'సేఫ్టీ ఫస్ట్..హెల్మెట్ మస్ట్' అనే నినాదంతో హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ఎక్కువ శాతం మానవ తప్పిదమే కారణమని తెలుస్తోందన్నారు. అవగాహన, ఆలోచనతో ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డుపై ప్రయాణిస్తే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలను నడపటం, సెల్ ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ టేకింగ్ తదితర తప్పిదాలతో వారు ఇబ్బంది పడటమే కాకుండా ఎదుటవారుకూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వివరించారు. రోడ్డు ప్రమాదాలతో అనేక మంది దుర్మరణం పాలవుతున్నారని, కొంతమంది క్షతగాత్రులు అవుతున్నారని చెప్పారు. మోటార్ వాహన చట్టాలకు లోబడి డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడేకంటే ముందస్తుగానే రహదారి భద్రతలను పాటిస్తే వాహనచోదకులతోపాటు రోడ్డుపై ప్రయాణించేవారికి ఎటువంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని పేర్కొన్నారు. సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణం, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు, ఆటో, లారీ, ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించడానికి జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా సూచనలతో ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి, ఏడీసీపీ ప్రసాద్ పర్యవేక్షణలో వన్ ట్రాఫిక్ ఏసీపీ జనార్దనరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో సురక్షిత తాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. గ్రామంలోని పలు వాటర్ ట్యాంకులను పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ.. ప్రధాన గ్రామంతో పాటు కాల్వ గట్టు ప్రాంతాల్లో మొత్తం 4 వాటర్ ట్యాంకులు, మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామంలో మరో 4 కొత్త వాటర్ ట్యాంకుల నిర్మాణానికై ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సిండికేట్ బ్యాంక్ కాలనీలో 2, సాయినగర్, హనుమాన్ నగర్‌లో ఒక్కో వాటర్ ట్యాంకు నిర్మాణానికి త్వరలో టెండర్లు ఆహ్వానిస్తామన్నారు. అలాగే గ్రామంలో వాటర్ పైప్‌లైన్ల విస్తరణ నిమిత్తం డ్వాక్రా గ్రూపులతో కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి

పెనమలూరు: విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి ముడిపడి ఉందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్, రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్నిగ్ధ మాట్లాడుతూ విద్య ద్వారా కుటుంబాలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయన్నారు. చదువు విలువ తెలిసిన సీఎం జగనన్న విద్యాభివృద్ధి చర్యలు తీసుకున్నారని చెప్పారు. విద్య ఒక్కటే భవిష్యత్తులో ఇచ్చే విలువైన ఆస్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యలో అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టడంతో పాటు నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి సీఎం జగనన్న కృషి చేశారన్నారు. జగనన్నే స్ఫూర్తిగా విద్యాభివృద్ధికి రక్ష ఫౌండేషన్ చేయూత అందిస్తోందని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. పాతబస్తీ ఇస్లాంపేటలోని మౌలానా ఆజాద్ ఉర్దూ కాంప్లెక్స్‌ను డీఈవో సుబ్బారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్య నేర్పాలని, బడి మానేసిన డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి చేర్పించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులు విధిగా తీసుకునేలా చూడాలని, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ప్రతి గురువారం తీసుకునేటట్లు చూడాలన్నారు.. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ నాగలింగేశ్వరరావు, మండల విద్యా అధికారి సోమశేఖర్ నాయక్, కాంప్లెక్స్ సెక్రటరీ నయ్ మహమ్మద్, ఇర్ఫాన్ పాషా రజియా సుల్తానా బాజీ, ఆలియా, హఫీజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

కొనసాగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గ్రామ సచివాలయాల్లో కొనసాగుతున్నాయి. సోమవారం నున్న గ్రామంలోని మూడు సచివాలయాలతో పాటు మిగిలిన గ్రామ సచివాలయాల్లో కూడా లబ్ధిదారుల పేరిట ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. విజయవాడ రూరల్ మండలంలో 10,670కి 6,450 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు జరిగాయని మండల తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు.

మహిళావిద్యతోనే మెరుగైన సమాజం

మైలవరం: మహిళల విద్య దేశాభివృద్ధికి పునాది అని ప్రవాసాంధ్రులు, విద్యాదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేకంగా విశ్రాంతి గదిని సోమవారం ఆయన ప్రారంభించారు. విశ్రాంతి గదిలో విద్యార్థినులు భోజనం చేయడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, ప్రత్యేకంగా చదువుకోవడానికి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినులకు అవసరమైన శానిటరీ నాప్‌కిన్లు పొందవచ్చన్నారు. ఎవరైనా విద్యార్థినులు అస్వస్థతకు గురైతే విశ్రాంతి తీసుకోవడానికి కర్టెన్స్‌లో బెడ్ ఏర్పాటు చేశామన్నారు. సమగ్రమైన లేడీస్ వెయిటింగ్ హాల్ ప్రారంభించిన డాక్టర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఇటువంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మరిన్ని సానుకూలమైన విద్యా పరిస్థితులు నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. మెరుగైన సమాజం కోసం మహిళావిద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి, మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ బి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు విశ్రాంతి గది ఏర్పాటు చేసిన హనిమిరెడ్డితో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థి ప్రతిభ

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ అండర్–7 విభాగంలో మైలవరం వివేకానంద విద్యార్థి ఆదూరి సర్జన్ ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పీ రాజారెడ్డి, ఎం. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఈ నెల 18 ఆదివారం విజయవాడ గుణదలలోని డాన్ బాస్కో స్కూల్‌లో జరిగాయన్నారు. ప్రథమ బహుమతి పొందిన ఆదూరి సర్జన్‌ను అభినందించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని కోటకట్ట సెంటర్‌లో హిందూ సమాజ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మాదు నాగ గోవర్ధన్, కార్యదర్శి ఆరేపల్లి శివ వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఆరేపల్లి రత్నాకర్, ఉపాధ్యక్షుడు మాదు మహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

పాత ఆర్‌ఆర్‌పేట 'గడప గడప'లో ఆసిఫ్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని, విజయాన్ని ఆపే సత్తా ప్రతిపక్ష పార్టీలకు లేదని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆసిఫ్ తెలిపారు. 56వ డివిజన్ పాత ఆర్‌ఆర్‌పేటలో సోమవారం గడప గడపకు ఆసిఫ్ కార్యక్రమం జరిగింది. ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ యలకల చలపతిరావుతో కలిసి జ్యుడిషియల్ కాలనీ, మెయిన్‌రోడ్డు, మెట్లబజార్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని స్థానికులకు వివరించారు. డివిజన్‌లో ఎన్నడూ జరగని విధంగా కోట్లాది రూపాయలతో తాగునీటి పైపులైన్లు ఏర్పాటు, రోడ్లు వేశారన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్‌ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. డివిజన్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల సమస్యపై కలెక్టర్, రైల్వే అధికారులతో మాట్లాడామన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వం డివిజన్ అభివృద్ధికి ఎటువంటి కృషి చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే డివిజన్‌లో అన్ని రకాల అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి చేశారన్నారు. దీనికి నిదర్శనం ఏ గడపకు వెళ్లినా ప్రజలు హారతులు పడుతు తాము పొందిన పథకాలను వివరిస్తుండటమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రబ్బానీ, వాసా బాబు, గొలగాని శ్రీను, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, సంగీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

దాసాంజనేయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైదిక కార్యక్రమాలను పూర్ణాహుతితో సోమవారం ముగించారు. సుమారు 50 అడుగులకు పైగా ఉన్న ధ్వజస్తంభాన్ని క్రేన్ సాయంతో తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను రుత్వికులు వేద పఠనం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 40 మంది పండితులు వేదపఠనాలను గావిస్తుండగా ఆగమ పండితుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు చేశారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని రుత్వికులు చేయించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, సహాయ కార్యదర్శి జీవీ రామారావు నిర్వహించారు. ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి బాబా విజయకుమార్, పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి లక్ష్మణస్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న రుత్వికులు, భక్తులు

సయ్యద్ గాలిబ్ షాహిద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైనార్టీలను ప్రభుత్వం ఆదుకుంటుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్‌ఆసిఫ్ తెలిపారు. భవానీపురంలోని సయ్యద్ గాలిబ్ షాహిద్ దర్గాను సందర్శించారు. జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్ ఇర్ఫాన్‌తో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. మైనార్టీలు రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీకి మద్దతివ్వాలని కోరారు. గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు చేసిన మేలును వివరించారు. అనంతరం ఆసిఫ్ మత గురువుల ఆశీస్సులు తీసుకున్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

పండుగలా ప్రతిష్ఠా మహోత్సవాలు

పెనమలూరు: పలుచోట్ల సోమవారం దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభాల ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాల్లో విశేష హోమాలు, పూజలు నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాలకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. పెనమలూరు గ్రామం పల్లిపేటలో సోమవారం శ్రీసీతారామచంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ విష్వక్సేన పూజ, హోమాల నిర్వహించిన అనంతరం ఉదయం 10.38 గంటలకు భక్తుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. విగ్రహ ప్రతిష్ఠను కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్, గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వనమాల ఏడుకొండలు, సభ్యులు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పల్లిపేటలో విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న తాతినేని దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

గోసాల గ్రామంలోని శ్రీసిటీలో శ్రీషిరిడీ సాయిబాబా, గణపతి, దత్తాత్రేయ స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయ శిఖర ప్రతిష్ఠ భక్తుల కోలాహలం మధ్య జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా ఆశీర్వాదం భక్తులు పొందారు. భక్తులకు అన్నసంతర్పణను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

● గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి నూతన దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం భక్తుల జయజయ ధ్వానాల మధ్య వైభవంగా జరిగింది. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గణపతి, శ్రీకృష్ణ, ధ్వజ, శిఖర పూర్వక హనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహాలను రుత్వికుల వేద మంత్రోచ్ఛారణలతో ప్రతిష్ఠించారు. జై శ్రీరామ్, జైశ్రీరామ్ అంటూ భక్తులు శ్రీరామచంద్రమూర్తిని కొలుస్తుండగా, ఉదయం నిర్ణీత సమయంలో ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని నిలిపారు. ప్రత్యేక యాగశాలలో వేదపండితులు హోమాలు నిర్వహించారు. గ్రామంలో తిరునాళ్ల సందడి నెలకొంది. గ్రామానికి చెందిన ఆడబిడ్డలు సుదూర ప్రాంతాల నుంచి గ్రామంలోకి రావటంతో ఇంటింట పండుగ వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 10 వేల మందికి అన్న సంతర్పణ నిర్వహించారు.

● మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హారతులు, పారాయణం నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ పర్యవేక్షించారు.

250 మందికి వైద్య పరీక్షలు

జి.కొండూరు(మైలవరం): ప్రతి ఒక్కరూ పరిపూర్ణమైన ఆరోగ్యంగా ఉండాలని మైలవరం ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు కే అనిల్ ఫ్రాన్సిస్ తెలిపారు. మైలవరం ఆర్‌సీఎం చర్చి, స్థానిక తేజస్వీ ఆసుపత్రి యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని జి.కొండూరు మండలం బీమవరప్పాడు గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విచారణ గురువు అనిల్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం సేవలను పేదలు వినియోగించుకోవాలన్నారు.